క్లుప్తంగా

సమష్టి కృషితో పార్టీ మరింత బలోపేతం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: పార్టీ మరింత బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కృషి చేయాలని మండల కన్వీనర్ సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న చెప్పారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 14 పంచాయతీల పరిధిలో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు అందరూ సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకుడు బాలరాజు తదితరులున్నారు.

రోడ్డు పనుల పరిశీలన



సుర్లపాలెంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు

జి.మాడుగుల: మండలంలోని సుర్లపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న రోడ్డు పనులను ఎంపీడీవో చంద్రశేఖరరావు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు పనులు పరిశీలిస్తున్నామన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఎస్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ టవర్ పనులు ప్రారంభం



లక్కవరపేటలో పనులను ప్రారంభించిన సర్పంచ్ నాగేంద్ర

గూడెంకొత్తవీధి : మండలంలోని లక్కవరపేటలో జియో సెల్ టవర్ పనులను సర్పంచ్ కంకిపాటి నాగేంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సెల్ టవర్ ఏర్పాటు చేయడం వలన సుమారు 20 గ్రామాలకు సంకేతాలు అందుతాయన్నారు. అత్యవసర సేవలకు సమాచారం అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. మరో పది రోజుల్లో సేవలు అందుబాటులోకి వస్తాయని సంబంధిత సిబ్బంది తెలిపారని వైస్ ఎంపీపీ సప్పగెడ్డ ఆనంద్ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణలక్ష్మి పూజలు



పూజలు చేస్తున్న వెంకటరామయ్య విజయలక్ష్మి దంపతులు, భక్తులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు నిర్వహించారు.గిరి దుర్గా భవాని అమ్మవారిని వరలక్ష్మీ అమ్మవారి రూపంలో అలంకరించి తొలి పూజ గావించారు.కుంకుమతో వివిధ రకాల సుగంధ పుష్పాలు, పత్రాలతో అమ్మవారికి సహస్రార్చన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కోయ భాష ఉపాధ్యాయులను నియమించాలి

చింతూరు: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని పాఠశాలల్లో కోయభాష ఉపాధ్యాయులను నియమించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మురళి కోరారు. గిరిజన విద్యార్థులకు మాతృభాషలో సులువుగా పాఠాలు అర్థమయ్యేందుకు ప్రవేశపెట్టిన కోయభాషకు ఉపాధ్యాయుల ఆవశ్యకత ఉందన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టేలా యంత్రాంగం కృషి చేయాలని కోరారు.

చకచకా పనులు

- గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల-2లో అభివృద్ధి పనులు
- రూ.1.57 కోట్ల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



పిల్లర్ స్థాయిలో కిచెన్, డైనింగ్ హాల్ నిర్మాణం



పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

అనంతగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. గతంలోని పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలుకగా... నేడు అభివృద్ధితో స్వాగతం పలుకుతున్నాయి. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాల మొదటి విడత నాడు-నేడులో సుమారు రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. అదనపు తరగతి గదులు, డైనింగ్, కిచెన్ షెడ్డు లేకపోవడంతో విద్యార్థినిలు సమస్యలను గుర్తించిన, ప్రభుత్వం విద్యార్థినిలకు సౌకర్యం కల్పించేలా చొరవచూపింది. నాబార్డులోని రూ.1.57 కోట్లతో అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్‌హాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన మౌలిక సదపాయాలు కల్పించడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన అడ్మిషన్లు

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి బాటలో నడుస్తుండడంతో విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. ఇందులో భాగంగా ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాలలో 310 మంది విద్యార్థిలు ఉండగా 150 మంది నూతన ఆడ్మిషన్లు జరిగాయి. మొత్తం 460 మంది వరకు విద్యార్థినిలు విద్యాభ్యాసం చేస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

గతం కంటే ప్రస్తుతం ఆడ్మిషన్లు పెరిగాయి. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. పాఠశాలలో సమస్యలను గుర్తించి, వెనువెంటనే అధికారులు దృష్టికి తీసుకెళ్తున్నాం. ఫలితంగా సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి.

– మంగమ్మ, హెచ్‌ఎం, గిరిజన సంక్షేమ బాలికల-2 పాఠశాల, అనంతగిరి

నాణ్యతగా పనులు

పాఠశాలలో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, కిచెన్, డైనింగ్ హాల్ తదితర పనురె నాణ్యత ప్రమాణాలతో చేయిస్తున్నాం. ఎప్పుటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం., పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గడువులోగా పనులు పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు కాంట్రాక్టర్‌కు ఆదేశాలిచ్చాం.

– గణేష్, ఏఈ, టీ డబ్ల్యూ , అనంతగిరి

ఆనందంగా ఉంది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, నాణ్యమైన భోజనంతో పాటు పుస్తకాలు, యూనిఫాం, తదితర సామగ్రిని అందజేయడం ఆనందంగా ఉంది.

– పద్మ, అనంతగిరి

సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన



మారేడుమిల్లిలో స్థానికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

- గడప గడపకు విశేష స్పందన
- ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబులకు ఘన స్వాగతం
- ప్రజా సమస్యల పరిష్కారానికి హామీ

మారేడుమిల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాల అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మారేడుమిల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 150 గడపలను వారు సందర్శించారు. గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి యోగ క్షేమాలు, సమస్యలను వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి మరలా ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించాలని కోరారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, సర్పంచ్ కొండా జాకబ్, వైస్ సర్పంచ్ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, మాజీ ఎంపీటీసీ గొర్లె అనిల్ ప్రసాద్(బాబీ), నాయకులు కర్రి శ్రీనివాస్‌రెడ్డి, స్మిత్, విక్టర్ బన్ను, సూర్యగౌడ్, సునీల్ కిషోర్ రెడ్డి, అనిదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సూచనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు, సచివాలయాల సిబ్బంది

అడ్డతీగల: స్థానిక సంస్థలకు కేటాయిస్తున్న 15 వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలు సూచించినట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. తనతో పాటు ఈవోపీఆర్డీ చిన్నబాబు, పంచాయితీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నట్టు చెప్పారు. పనులకు కేటాయించిన నిధుల ఖర్చులపై అనుసరించాల్సిన నిబంధనలు తదితర అంశాలను తెలియజేసినట్టు పేర్కొన్నారు.

అర్హులైన గ్రూపులకు రుణాలు



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్, పక్కన ఏపీజీవీ బీఎం సతీష్

కొయ్యూరు: డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించాలని ఏపీఎం శ్రీనివాస్, ఏపీజీవీ బ్యాంకు మేనేజర్ సతీష్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి గ్రూపునకు రుణాలు ఇస్తామన్నారు. తీసుకున్న రుణాల చెల్లింపులో కొంత జాప్యం జరుగుతుందన్నారు. దీనిపై వెలుగు సిబ్బంది గ్రూపులను చైతన్యం చేయాలని కోరారు. చెల్లింపులకు సంబంధించి పూర్తి వివరాలు నమోదు చేయాలని సూచించారు. సీసీలు దీనిని బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సీసీలు రమణమ్మ, అప్పలనర్స, నాగేశ్వరరావు, గాంధీ, ప్రసాద్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు

డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాలి



చింతపల్లిలో డ్రాపౌట్ విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్న అధికారులు



ముంచంగిపుట్టులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమేష్

చింతపల్లిరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, ఎంఈవో వనపల ప్రసాద్ సచివాలయం సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డ్రాపౌట్ విద్యార్థులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించారు. పిల్లలను రోజూ పాఠశాలకు పంపాలని సూచించారు. మండలంలో 211 పాఠశాలల పరిధిలో 495 మంది డ్రాపౌట్ విద్యార్థులున్నట్టు వారు చెప్పారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-1ను ఎంపీడీవో రమేష్ శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రాపౌట్ విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడారు. పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమం 17 నుంచి ప్రారంభమైందని, పది రోజుల పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు ఎంఈవో, ఏటీడబ్ల్యూవో, హెచ్‌ఎంలు పాల్గొంటారని తెలిపారు. హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీవీటీజీల సమస్యల పరిష్కారానికి హామీ

- ఆదివాసీ, గిరిజన సంఘాల నేతలతో మాట్లాడిన ఐటీడీఏ పీవో, జేసీ
- ఆందోళన విరమించిన నేతలు



పీవీటీజీలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: పీవీటీజీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన చలో ఐటీడీఏ కార్యక్రమంలో భాగంగా నాయకులు తదితరులు ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ ఎదుట బైఠాయించారు. గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, మాట్లాడుతూ పీవీటీజీలకు అంత్యోదయ కార్డులు పునరుద్ధరించాలని, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో అభిషేక్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. పీవీటీజీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సంఘాల నాయకులు ఆందోళన విరమించారు. నేతలు ధర్మన్నపడాల్, త్రినాథ్, బాలయ్య, సర్పునాయుడు, రామన్న, సుందర్‌రావు, సత్యనారాయణ, చిట్టిబాబు, బాలయ్య పాల్గొన్నారు.

26న మండల సమావేశం

కొయ్యూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలతో అధికారులు రావాలన్నారు.

21న అధికారులతో సమావేశం

కొయ్యూరు: ఎంపీపీ బడుగు రమేష్ ఆదేశాల మేరకు ఈ నెల 21న మండల కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య శుక్రవారం తెలిపారు. సంబంధిత అధికారులు ఈ మూడు నెలల కాలంలో చేసిన అభివృద్ధి పనుల నివేదికలతో రావాలని కోరారు.

ఎన్నికల సిబ్బందికి సూచనలు

గూడెంకొత్తవీధి: మండలంలోని సీలేరులో శనివారం నిర్వహించనున్న సర్పంచ్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు.డీటీ కుమారస్వామి, ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో ఆర్థిక భరోసా



సిబ్బందికి సూచనలిస్తున్న ఏడీ నరసింహులు

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ శాంతినగర్‌లో పశు సంవర్ధకశాఖ అరుకు ఏడీ నరసింహులు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న కోళ్ల ఫారాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా లాభాలు పొందవచ్చన్నారు. కోళ్ల ఫారం ఏర్పాటుకు శాఖ తరపున శిక్షణ, సూచనలందజేస్తామన్నారు. దీనిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల్లో కోళ్ల ఫారాలు ఏర్పాటుచేయాలన్నారు. మరిన్ని సలహాలకు పశుసంవర్ధక శాఖాధికారులను సంప్రదించాలన్నారు. వెటర్నరీ డాక్టర్లు గౌతమ్, శీనయ్య, సిబ్బంది త్రినాథరావు, జానకి, సంజీవ్‌రావు, అనంత్‌రావు, అప్పారావు, మహేష్, ప్రకాష్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



చింతపల్లి కళాశాలలో వైద్యశిబిరం



పలకజీడిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌వీ నగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాత్రుడు తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జ్వరాల లక్షణాలు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రం అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొయ్యూరు: పలకజీడి వారపు సంతలో యూ.చీడిపాలెం వైద్యులు జయప్రకాశ్ శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంతకు సుమారు 25 గ్రామాలకు చెందిన గిరిజనులు వచ్చారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. అనంతరం పలకజీడి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. మరగబెట్టిన నీటిని తాగాలనివిద్యార్థులకు సూచించారు. ఎల్‌టీ ఆనంద్, ఫార్మసిస్ట్ సురేంద్ర, వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు

చింతపల్లిరూరల్: మండంలోని కిటుముల పంచాయతీ జాజులపాలెంలోని బాలుర ఆశ్రమ పాఠశాల, పలడ గ్రామంలో లంబసింగి డాక్టర్ నీరజ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీహెచ్‌వో సౌజన్య, ఏఎన్‌ఎం నాగరత్నం,హెచ్‌వీ అక్కి పాల్గొన్నారు.



జాజులపాలెంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రైతులకు రాజ్‌మా విత్తనాలు



రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో పాత్రుడు, హెచ్‌సీ అప్పలరాజు

జి.మాడుగుల: ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో అందిస్తున్న రాజ్‌మా విత్తనాలు ద్వారా వ్యవసాయాభివృద్ధి సాధించాలని మండల వ్యవసాయశాఖ అధికారిఎల్.పాత్రుడు, హెచ్‌సీ అప్పలరాజు, అప్పారావు తెలిపారు. మండలంలో నుర్మతి, బొయితిలి, కొరాపల్లి పంచాయతీలకు చెందిన గిరిజన రైతులకు పోలీస్‌శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల్లో శుక్రవారం రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. కోరాపల్లి పంచాయతీలో 440 మంది, నుర్మతి పంచాయతీలో 440 మంది రైతులకు ఒక్కో రైతుకు 5కిలోల చొప్పున రాజామా విత్తనాలు వారు అందజేశారు. ఎంపీటీసీ సభ్యులు నానాజీ, అప్పలరాజు, నుర్మతి సర్పంచ్ సూరిబాబు, ఎంపీహెచ్‌ఈవో ప్రశాంత్‌కుమార్, ఉదయ్‌కుమార్, సత్తిబాబు, అనూష, గిరిజన రైతులు పాల్గొన్నారు.

చీరలు, భజన సామగ్రి పంపిణీ



కోడిమామిడిలో మహిళలకు చీరలు, భక్తులకు భజన సామగ్రి అందజేస్తున్న ఆశ్రమం ప్రతినిధులు

జి.మాడుగుల: మండలంలోని కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి, కప్పలు, సూరిమెట్ట తదితర గ్రామాల్లో మహిళలకు చీరలు, భక్తులకు భజన సామగ్రిని అందజేశారు. విశాఖపట్నానికి చెందిన దువ్వాడ శ్రీకుసుమహరనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో గాయత్రి ఇండస్ట్రీస్ అధినేత పి.ఎస్.దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్ ఆయా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో భజనల సంప్రదాయ సంస్కృతిని ప్రోత్సహించడమే ధ్యేయంగా కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రకాష్, ముంచంగిపట్టు ఎంపీడీవో రమేష్ రాము, బుద్ధభవాన్, హరబాబు తదితరలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కాంట్రాక్ట్ అధ్యాపకుల కృతజ్ఞతలు





ముంచంగిపుట్టు, చింతపల్లి కాలేజీల్లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు అధ్యాపకులు చెబుతున్నారు. లలప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ జీవితాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని కాంట్రాక్టు ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతను తెలియజేశారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు లక్ష్మణకుమార్, దామోదరం, కోటిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం అభినందనీయమని స్థానిక డిగ్రీ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలేజీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్టు ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తమ కుటుంబాలు జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాయని వారు చెప్పారు.కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈశ్వర్‌బాబు నాయుడు, రత్నం, మోడినాయుడు, ఈశ్వరరావు, సంతోషిమాత, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగు సమస్యపై వినతి



ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందచేస్తున్న కమిషన్ సభ్యుడు మురళి

చింతూరు: మండలంలోని బొడ్డుగూడెంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకర్‌నాయక్‌ను కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి కోరారు. తాడేపల్లిలో ఆయనను శుక్రవారం మురళి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొడ్డుగూడెంలో ఎన్నో ఏళ్లుగా గిరిజన రైతులు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారిని అటవీ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఛైర్మన్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వైస్ ఎంపీపీ యడమ అర్జున్ తదితరులున్నారు.